ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 17 సంచిక : 08 ఏప్రియల్ 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
08814 - 224747
9247104551

ఈ సంచికలో....

విశాఖపట్నం ... 12-09-2011

జిన్నూరు ......... 20-02-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-09-2011, విశాఖపట్నం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

యోగయుక్తుడు అంటే వ్యక్తిభావన లేకుండా, అహంభావన లేకుండా కర్మని యోగంగా చేసేవాడిని యోగయుక్తుడు అంటారు. నేను చేస్తున్నాను అనే తలంపుతోటి పనిచేస్తే ఆ కర్మ కర్తని వెంటాడుతూ ఉంటుంది. కర్తృత్వం లేకుండా పనిచేస్తే వాడికి శాంతి కలుగుతుంది. సుఖం కలుగుతుంది. నిష్కామకర్మ బ్రాహ్మీస్థితి పొందటానికి సహకరిస్తుంది. మనం చేస్తున్న పని బ్రాహ్మీస్థితిని పొందటానికి అనుకూలంగా ఉండాలి. అదే కర్మయోగం.

మాటలో నియమంగా ఉండమని, ఆహారవిషయంలో నియమంగా ఉండమని, అతినిద్ర పనికిరాదని, వ్యవహారం కూడా తగుమాత్రంగా ఉండాలి అని ఈ నియమాలన్నీ మనస్సుని నీకు అనుకూలంగా చేసుకోవటానికి పెద్దలు చెప్పారు. మన చేతిలో మనస్సు ఉండాలికాని, మనస్సు చేతిలో మనం ఉండకూడదు. మన చేతిలో కనుక మనస్సు ఉంటే అది మనకు మిత్రుడిగా పనిచేస్తుంది. మనస్సు చేతిలో మనం ఉంటే ఆ మనస్సే మనకి శత్రువుగా పనిచేస్తుంది. మన చేతిలో మనస్సు ఉంటే బాహ్యంగా మనకు ఎంతమంది శత్రువులు ఉన్నా ఎవరూ మనల్ని ఏమీ చేయలేరు. మనస్సు చేతిలో మనం ఉంటే ఎంతమంది మన అభివృద్ధికి కృషి చేసినా ప్రయోజనం కనబడదు. అందుచేత నీ మనస్సుని నువ్వు విరోధంగా చేసుకోకు. నీకు బంధువుగా చేసుకో. ఆ మనస్సు నీ ఆధ్యాత్మిక పురోభివృద్ధికి, భౌతిక పురోభివృద్ధికి

కూడా ఉపయోగపడుతుంది. మనోనిగ్రహం లేకపోతే ఇహమూ లేదు, పరమూలేదు. మనం భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా అభివృద్ధిలోకి రావాలంటే మన మనస్సుని మనం నియమించుకోవాలి.

పవిత్రమైన హృదయము కలవాడు, హృదయశుద్ధి గలవారు ధన్యులు వారు దేవుని చూచెదరు. ఆలోచన, మాట, చేత ఒకటిగా ఉన్నవాడికి హృదయశుద్ధి కలుగుతుంది. హృదయశుద్ధిని మనం సంపాదించాలంటే సత్వగుణం సంపాదించాలి. హృదయశుద్ధి లేకపోతే మనకి బ్రాహ్మీస్థితి సాధ్యముకాదు. హృదయశుద్ధి మనకి ఉందో లేదో చూచుకుని లేకపోతే సంపాదించుకోవాలి కాని లేదు లేదు అనుకోకూడదు. ఏ పని చేసినా ఆ పని ద్వారా మనం హృదయశుద్ధి పొందుతున్నామా, లేదా అని చూచుకోవాలి. మనస్సు ఎక్కడ అణుగుతుందో అక్కడ సత్యము తెలియబడుతుంది కాని అది మనస్సు చేత గ్రహింపబడేది కాదు. మనోనాశనానికి అనేక ఉపాయాలు భగవద్గీతలో చెప్పాడు.

మనం మనస్సునీ, ఇంద్రియాలనీ నియమించుకోవాలి. మన మనస్సు ఏ విషయాల గురించి బాహ్యముఖం అవుతోంది అని పరిశీలించుకుని, ఆ విషయాలనుండి బయట పడటానికి మనం ప్రయత్నం చేసుకోవాలి. మనకి ఇష్టాలు, అయిష్టాలు ఎక్కడా లేవు అనుకోండి అప్పడు మీ మనస్సుని కదలమంటే కదలదు. ఇష్టమూ బంధమే, అయిష్టమూ బంధమే. రెండూ మనల్ని బంధిస్తాయి. ఇష్టాలు, అయిష్టాలులోనుండి నువ్వు విడుదల పొందలేకపోతే మనస్సు యొక్క చాపల్యంలోనుండి నువ్వు బయటకు రాలేవు. ఆహారంలో నుండే మనకి శరీరం తయారవుతోంది, ఆహారంలోనుండే మన మనస్సు తయారవుతోంది. అందుచేత ఆహారవిషయంలో నువ్వు జాగ్రత్త తీసుకుంటే ఇంద్రియాలు, మనస్సు స్వాధీనంలోకి వస్తాయి. మన శరీరాలు వేరుగా ఉన్నాయి, మన మనస్సులు వేరుగా ఉన్నాయి, మన ప్రవృత్తి వేరుగా ఉంటుంది కాని హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థం ఒక్కటే. మనం ఎవరికైనా పండు ఇస్తే అది అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే స్వీకరిస్తున్నాడు. కాని మనం వ్యక్తికి ఇస్తున్నాం అని అనుకుంటాము. దీనికి రమణమహర్షిగారు అన్నారు నువ్వు ఇతరులకు ఏది ఇచ్చినా అది మళ్ళీ తిరిగి నీకే వచ్చేస్తుంది అన్న సంగతి తెలిస్తే నువ్వు ఇతరులకు ఏమైనా ఇవ్వకుండా ఉండగలవా? నువ్వు మంచిచేసినా, చెడ్డచేసినా అది లోపల ఉన్న ఈశ్వరుడికే అందుతుంది.

అందుచేత నువ్వు మంచికి మంచి, చెడ్డకి చెడ్డ, ఎత్తుకు ఎత్తు భవిష్యత్తులో నీకు అనుభవానికి వస్తుంది. ఈ కర్మ నేను చేస్తున్నాను అని నువ్వు చేసావా నువ్వు ఏ లోకంలో ఉన్నా, ఏ జన్మలో ఉన్నా ఆ కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది. నేను చేస్తున్నాను అనే తలంపు లేకుండా నువ్వు పనిచేస్తే నీకు రెండు లాభాలు. ఫలితానికి ఫలితం వస్తుంది. నీ మనస్సు పవిత్రం అవుతుంది. ఆ పని నిన్ను ఈశ్వరానుభవం పొందటానికి ప్రిపేర్ చేస్తుంది. స్వార్థంతో పనిచేస్తే దేహభావనని పెంచుతుంది. స్వార్థం లేకుండా పని చేస్తే దేహభావనలోనుండి విడుదల చేస్తుంది.

ఆత్మస్తుతి, పరనింద ఇవి రెండూ పెద్ద రోగాలు. చాలామంది వాళ్ళని వాళ్ళు పొగుడుకుంటూ ఉంటారు. ఇతరుల్ని విమర్శిస్తూ ఉంటారు. ఇతరుల్ని విమర్శించేవాళ్ళ గురించి షిరిడీసాయిబాబా అనేవారు మీరు రోజూ అన్నం తినటం మానేసి వాళ్ళ మలం ఎందుకు తింటారు, వాళ్ళ మలం తింటున్నారు అని మీకు తెలియక అలా విమర్శిస్తున్నారు అని చెప్పేవారు. వాళ్ళ లోపాల గురించి మీరు మాట్లాడేబదులు, మీలో లోపాలు ఉంటే వెదుక్కుని వాటిని బయటికిలాగి తగలబెట్టుకోండి అన్నారు. ఇతరుల్ని విమర్శించటం వలన మీకేమీ కలిసిరాదు పైగా పాపం వస్తుంది, వాళ్ళు చేసిన దోషాలు మీకు అంటుకుంటాయి. ఆ ఫలితం మీరు అనుభవించవలసి ఉంటుంది. అందుచేత సాధకుడు ఆత్మస్తుతి, పరనింద ఈ రెండూ విడిచిపెట్టటానికి ప్రయత్నం చేయాలి.

ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అది అంతటా ఉంది. అది లేనిచోటు అంటూ లేదు. అది మన హృదయంలో సాక్షిగా ఉంది. మనం చేత్తోటి చేసేపనికేకాదు, నోటితోటి మాట్లాడే మాటకేకాదు, మనకి ఏ తలంపు వచ్చినా ఆ తలంపుకి భగవంతుడు సాక్షిగా ఉన్నాడు. ఏదో జన్మలో ఆయనకు మనం సమాధానం చెప్పాలి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసము ఉండాలి. అయితే మన విశ్వాసం అంత లోతుగా లేదు. మనకి ఆత్మవిశ్వాసం తక్కువ ఉంటే, ధైర్యము తక్కువ ఉంటే ప్రతీదానికీ దుఃఖము వచ్చి నెత్తిమీద పడుతూ ఉంటుంది. దుఃఖము మనం ఎందుకు నిరాకరిస్తామంటే మన స్వరూపంలో దుఃఖం లేదు కాబట్టి, ఆనందం వస్తే స్వీకరిస్తాము ఎందుచేత మన స్వరూపంలో ఆనందం ఉంది కాబట్టి. మనకి మరణం వస్తే ఇష్టపడం ఎందుచేతనంటే మనలో ఏ సద్వస్తువు

అయితే ఉందో దానికి మరణం లేదు. ఆ మరణం లేని వస్తువు మనమై ఉన్నాము. అది మనమై ఉన్నాము కాబట్టి మరణం వస్తే మనం అంగీకరించము. మనకి వుండాలని ఎందుకు ఉంది? ఆ సద్వస్తువు దేహం పోయిన తరువాత కూడా ఉంటుంది. ఆ ఉండేదే మనమై ఉన్నాము కాబట్టి మనకి వుండాలని ఉంటుంది. శరీరం పోయిన తరువాత కూడా మనం వుంటాము అన్నది శరీరం ఉండగానే మనకి అనుభవంలోకి వస్తే శరీరం ఉన్నా, శరీరం పోయినా మనకు ఏమీ అనిపించదు. రామకృష్ణ పరమహంసగారు చెప్పారు ఇవాళ పగలకి రేపు పగలకి ఈ రాత్రి ఎటువంటిదో ఈ జన్మకీ రాబోయే జన్మకీ మరణం అటువంటిది. చనిపోవటం మళ్ళీ పుట్టటం అంటే ఒక గదిలోంచి ఇంకో గదిలోకి వెళ్ళటం అని చెప్పారు.

మహాత్ముల దర్శనం వలన, మహర్షులతోటి సాంగత్యం వలన మనం ఎంతోకొంత లాభం పొందుతాము. ఆ వస్తువుకి సంబంధించిన రీలైజేషన్ వాడికి రాకపోయినా హృదయంలో ఏదో వుంది అని తెలుస్తుంది. అక్కడి నుంచి దానికోసం ప్రయత్నం ప్రారంభిస్తాడు. మన హృదయంలో ఏదో వుంది దానిని తెలుసుకోవాలనే కాంక్ష మహాత్ముల సమక్షంలో మనకి వచ్చింది. అందుచేత మహాత్ముల దర్శనం యొక్క లాభం అది. మహాత్ముల యొక్క దర్శనం చేయటం వల్ల భౌతికంగా అయినా, ఆధ్యాత్మికంగా అయినా ఏదో రకమైన లాభం పొందకుండా ఆ జీవుడు బయటకు వెళ్ళడు. రమణమహర్షిగారు ఏమన్నారు అంటే నీకు ఎప్పుడైనా సత్యవస్తువులోపల వున్నట్టు స్ఫురించినా అది నిలబడదు. వాసనాక్షయం అయ్యాక నీకు కలిగిన జ్ఞానాన్ని నమ్మాలికాని ఈ లోపులో నమ్మటానికి వీలులేదు. వాసన ఉన్నంతకాలం నీకు ఆ వస్తువుని అనుభవంలో వుండనివ్వదు. వాసన అంటే ఫలకాంక్షతోటి మనం ఏదో పని చేస్తాము. ఫలితం వస్తుంది. ఫలితాన్ని మనం ఎంజాయ్ చేస్తాము. ఎంజాయ్ చేసినప్పుడు వచ్చే భావన వాసన కింద వుండిపోతుంది. మళ్ళీ ఆ వాసనలోంచి తలంపు వస్తుంది. తలంపులోంచి మాటవస్తుంది. తలంపులోంచి పని చేస్తాము. మనం తిన్న తిండిని బట్టే తేనుపు వస్తుంది. అలాగే వాడు చేసిన పనిని బట్టి వాసన వస్తుంది. ఇదే సంసారం అంటే. భర్త పిల్లలు సంసారం కాదు. వాసనాక్షయం అయ్యేవరకు మిమ్మల్ని మీరు నమ్మవద్దు. మీకు వచ్చిన అనుభవాన్ని వాసన స్థిరంగా వుండనివ్వదు. కానీ ఒకసారి అనుభవం పొందారు కాబట్టి మనం ఎక్కడ పతనం అవుతున్నామో అది తెలుస్తూ ఉంటుంది.

అలవాట్లయొక్క వేగం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ వాసన పోగొట్టుకోవాలంటే గురువు దయ ఉండాలి.

డబ్బు, చదువు, అధికారం ఇవన్నీ చెడ్డవి కాదు. చదువు, ధనం ఉండవచ్చు వాటితో తాదాత్మ్యం చెందకూడదు. చదువు, ధనం వలన మనకి అహంకారం పెరగకుండా చూచుకోవాలి. వాటిని దుర్వినియోగం చేసుకుంటే చెడ్డలోకాలకి వెళ్ళాలి. వాటిని సద్వినియోగం చేసుకుంటే పుణ్యలోకాలకి వెళ్ళటానికి అవి సహకరిస్తాయి. నువ్వు పుణ్యం చేస్తే ఆ పుణ్యం నీకు జ్ఞానానికి పెట్టుబడిగా ఉపయోగపడుతుంది. మంచి పనులు చేయటం వలన చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే మనం మోక్షానికి వెళ్ళాలికాని ఇంకో మార్గం లేదు. విభూతి అంటే ఐశ్వర్యం. లోకంలో ఉన్న ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. నీకు ధనం వచ్చినా, గౌరవం వచ్చినా, అధికారం వచ్చినా, చదువు వచ్చినా ఇదంతా భగవంతుడు ప్రసాదించినదే. నీదంటూ ఏమీ లేదు. అది ఒక గిఫ్ట్ అంతే. భగవంతుడి సంకల్పం లేకుండా ఏదీ మనకు రాదు. భగవంతుడు ఒకోసారి నీకు మంచి అవకాశాలు ఇస్తాడు. ఆ అవకాశాలను నువ్వు సద్వినియోగం చేసుకుంటే ఇంకా మంచి జన్మలు ఇస్తాడు. అవకాశాలు కనుక నువ్వు దుర్వినియోగం చేసుకుంటే నీకు చెడ్డ జన్మలు వస్తాయి. మరణించిన తరువాత చీకటిలోకాలకి వెళ్ళాలి. ఒక తాతగారు వాళ్ళ మనవడికి ఐదు రూపాయలు ఇచ్చారు. మనవడు ఐదు రూపాయ లో ఒక రూపాయి మళ్ళీ తిరిగి తాతగారికి ఇచ్చి అందరితోటి మా తాతయ్యకు రూపాయి ఇచ్చాను అనేవాడు. ఆ రూపాయి ఎవరిది? తాతయ్యదే. తాతయ్యది తాతయ్యకే ఇచ్చి, నేను ఇచ్చాను అనేవాడు. మనం చేసే దానధర్మాలు కూడా ఇలాగే ఉన్నాయి. సొమ్ము ఎవరిది? ఈశ్వరుడిది. ఆయనది ఆయనకే ఇచ్చి మనం ఇచ్చాము అనుకుంటున్నాము. మనకి ఐశ్వర్యం ఇచ్చేవాడు ఈశ్వరుడు, తీసుకునేవాడు ఈశ్వరుడు.

కర్తలేని కర్మ చేసేవాడు ఈ లోకంలో బుద్ధిమంతుడు అని పరమాత్మ చెప్పాడు. కర్తృత్వం వల్ల మనకి దుఃఖం వస్తుంది. ఈ పని నేను చేసాను అనే తలంపు వల్ల దుఃఖం వస్తుంది. కర్తృత్వం లేకుండా, నువ్వు పని చేస్తే నీకు దుఃఖ స్పర్శ కూడా రాదు. అహంభావన లేకుండా పనిచేస్తే అది నిన్ను బంధించదు. మనకి వచ్చే భావన వెనకాల అహంభావన

ఉందో లేదో మనం చూచుకోవాలి. తలంపు వచ్చాక మనం పనిచేస్తాము. మన తలంపు వెనుక అహంభావన ఉంటే మనం పతనమవుతాము. చిత్తశుద్ధి లేకుండా మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా ఆత్మాకారం చెందదు. అది ఆత్మాకారం చెందకుండా నీకు ఆత్మజ్ఞానం రాదు. ఆత్మజ్ఞానం అన్నా, మోక్షం అన్నా, నిర్వాణ స్థితి అన్నా ఒకటే. అహంభావన లేనివాడికి ఆత్మజ్ఞానం వస్తుందికాని, అహంభావన ఉన్న వాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

**న కర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతి ప్రభుః**

**న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే (5-14)**

నేను చేసాను అనే భావన మీ స్వభావం వలన, ప్రకృతి వలన వస్తోందికాని ఈ లోకంలో కర్తృత్వమునుకాని, కర్మలనుకాని, కర్మఫలముతోటి సంబంధముగాని నేను కల్పించలేదు అంటున్నాడు పరమాత్మ. ఎవడి స్వభావాన్నిబట్టి వాడు పని చేస్తున్నాడు. రకరకాల కర్మలు చేసుకుంటున్నారు. నీ అలవాట్లని బట్టే స్వభావం ఏర్పడుతుంది. నీ అలవాట్లని బట్టే నువ్వు చేసుకుంటున్నావు కాని ఆ పని చెయ్యమని నీకు నేనేమీ కల్పించలేదు. ఈ పని నేను చేసాను అనే పొగరుబోతుతనం కూడా నేను నీకు కల్పించటంలేదు. ఇది అంతా నీ స్వభావాన్ని బట్టి, పూర్వజన్మల వాసనలనిబట్టి, సంస్కారాలనిబట్టి నువ్వు చేసుకుపోతున్నావు. ఇవన్నీ నువ్వు కల్పించుకున్నవి, ప్రకృతి కల్పించినవి నాకు వీటితో ఏమీ సంబంధం లేదు. అందుచేత నీ స్వభావాన్ని మార్చుకోవాలి, నీ అలవాట్లయొక్క వేగాన్ని తగ్గించుకోవాలి. ఎందుకు మార్చుకోవాలి? మంచి కర్మలు ఎందుకు చెయ్యాలి? చెడ్డ కర్మలు ఎందుకు చెయ్యకూడదు? మనో నిగ్రహం ఎందుకు? ఇవన్నీ భగవంతుడిని పొందటంకోసం ఈ నియమాలు అవసరం. ఒక క్రమశిక్షణ లేకుండా, ఒక నియమ బద్ధమైన జీవితం లేకుండా నువ్వు భగవంతుడిని పొందలేవు అని చెప్పాడు.

చాలామంది ఇంట్లో ధనం ఉన్నా మనస్సులో దారిద్ర్యంగా ఉంటారు. మోక్షం పొందటానికి మనస్సులో ఉన్న దారిద్ర్యం అడ్డువస్తుంది కాని ఇంట్లో ఉన్న దారిద్ర్యం మోక్షం పొందటానికి అడ్డురాదు. మన ఇంట్లో దారిద్ర్యం వలన మనం ఇతరులకు ఏమీ ఇవ్వలేక పోయినా వాళ్ళు శాంతిగా ఉండాలి, సుఖంగా ఉండాలి అని వాళ్ల క్షేమం కోరుకోవటంలో

దారిద్ర్యం పనికిరాదు. మీ మనస్సు సంస్కరింపబడినది అయితే నిగ్రహింపబడిన మనస్సు అయితే, నీ మనస్సుకి అర్హత ఉంటే అప్పుడు ఇతరుల క్షేమం నువ్వు కోరతావు. ఇతరులందరూ సుఖంగా ఉండాలి అని నువ్వు కోరితే నీ వైబ్రేషన్స్ వాళ్ళకి పనిచేస్తాయి. అది వాళ్ళకి ఉపకారం. నీకు ఉపకారం ఏమిటిఅంటే నువ్వు ఎవరి క్షేమం కోరుతున్నావో వాళ్ళు బాగుపడినా, బాగుపడకపోయినా నీకు బ్రహ్మానుభవం పొందటానికి అర్హత వస్తుంది. మనస్సులో ఉన్న దారిద్ర్యం వల్లే నీకు చీకటిలోకాలు వస్తాయి. అందుచేత మనస్సులో దారిద్ర్యం పనికిరాదు. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు. లేనిదానికి ఉండటం అంటూ లేదు అన్నాడు పరమాత్మ. మనం ఉన్నదానిని లేదు అనుకుంటున్నాము. లేనిదానిని ఉంది అనుకుంటున్నాము. బుద్ధిమంతులనుకూడా ఒకోసారి చెడ్డవాళ్ళు అనుకుంటాం. చెడ్డవాళ్ళని ఒకోసారి మంచివాళ్ళు అనుకుంటాం. అంటే మనకి సరియైన అవగాహన లేదు. ముందు నీ మనస్సులో ఉన్న బలహీనత ఏమిటో నువ్వు చూసుకో. మీకు ఎవరిమీద అయినా ద్వేషం వస్తోంది అనుకోండి అదొక బలహీనత. మీరు మనస్సుని స్కేనింగు చెయ్యాలి. స్కేనింగు చేసి మారుమూలన ఉన్న బలహీనతలు ఏమిటో పరిశీలనచేసి తెలుసుకోవాలి. రోగం తెలిసిన తరువాత రోగనివారణకి ప్రయత్నం చెయ్యాలి. అలాగే నీ బలహీనత తెలిసినతరువాత, ఆ బలహీనత లేని వాళ్ళతోటి నువ్వు స్నేహం చేస్తే ఆ బలహీనత తొందరగా పోతుంది. అందుకే సజ్జనసాంగత్యం చెప్పారు. మన హృదయంలో ఉన్న సద్వస్తువుతోటి మనం కలిసి ఉండలేకపోతున్నాము అనుకోండి, బయట ఉన్న సత్పురుషులతోటి స్నేహం చెయ్యవచ్చు. ఆ సత్పురుషులు కూడా దొరకటంలేదు అనుకోండి, సద్గ్రంథాల పారాయణం చెయ్యాలి. మీరు నిద్రపోయేముందు ఒక పవిత్ర గ్రంథం ఒక గంట అధ్యయనం చేసుకుంటే దాని ప్రభావం వలన రాత్రి అంతా నీకు సాధన జరుగుతుంది. మరణించే టైములో మీకు నా స్మరణ ఉంటే మీరు మంచి స్థితిని పొందుతారు అని గీతలో పరమాత్మ చెప్పాడు. సందేహాలు పెట్టుకోవద్దు. భగవంతుడిపట్ల మనకి నూటికి నూరు పాళ్ళు విశ్వాసం ఉంటే సందేహాలు పోతాయి. స్థిరబుద్ధి కలుగుతుంది. ఆయన పట్ల శరణాగతి వస్తుంది. పూర్ణశరణాగతి వలన కూడా మనకి మోక్షం వస్తుంది. కంటిలో నలుసు, కాలిలో ముల్లు ఎటువంటివో సందేహాలు కూడా అటువంటివే. అందుచేత నువ్వు సందేహాలు పెట్టుకోవద్దు. మనం విశ్వాసహీనులు అవ్వకూడదు.

హృదయంలో సత్యవస్తువు లేకపోతే అది రమణుడికి అనుభవంలోనికి రాదు, రామకృష్ణుడికి అనుభవంలోనికి రాదు. ఆత్మజ్ఞానం మనకి లేకపోవచ్చు కానీ ఉన్న వాళ్ళని చూస్తున్నాము కదా. హిందూధర్మాన్ని బట్టి కొంతమంది అలా జీవిస్తున్నారు. అందుచేత హిందూమతం జీవనది అయ్యింది. భగవద్గీతలో గుణాతీతలక్షణాలు చెప్పాడు, జీవన్ముక్త లక్షణాలు చెప్పాడు. ఆ జీవన్ముక్తస్థితి పొందినవారిలో కంచిపరమాచార్యులు ఉన్నారు? ఆయనకి తపస్సు ఉంది, విద్య ఉంది, అనుభవం ఉంది. అనుభవం ఉండటం వలన ఆయన జీవన్ముక్తుడు అయ్యాడు. పరమాచార్య 100 సం॥లు జీవించారు. ఆయన గొప్ప ఆహార నియమం గలవారు. ఆహార నియమంలో ఆయన్ని మనం ఆదర్శంగా పెట్టుకోవాలి. ఇప్పుడు కొంతమంది ఉపనిషత్తులు చెబుతున్నారు. అది డ్రైగా ఉంటోంది. ఎందుచేతనంటే వాళ్ళకి తపస్సులేదు. పరమాచార్య మాట్లాడుతూ ఉంటే మీ చెవిలో రహస్యం చెప్పినట్టు ఉంటుంది. అంత నెమ్మదిగా, స్థిరంగా మాట్లాడతారు. ఆయన మాట్లాడిన ప్రతీ మాటకీ శాస్త్రాన్ని ప్రమాణంగా చూపిస్తారు. మీకు ఎంతవరకూ అర్థమవుతోంది, మీరు ఎంతవరకూ బాగుపడు తున్నారు అని చూచుకుంటూ ఉంటారు. కానీ ఆయన గురించి మీరేమనుకుంటున్నారో, చప్పట్లు కొడుతున్నారా, లేదా అవేమీ ఆయనకు అక్కరలేదు. ఆయన పరమాచార్య.

ఈ లోకం మంచిదా, చెడ్డదా అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. లోకం మంచిదీకాదు, చెడ్డదీకాదు అన్నారు. మనం హాస్పటల్‌కి వెళ్ళి స్కేనింగు తీయించుకుంటే అది జబ్బు ఉందో లేదో చెబుతుంది కాని స్కేనింగు మనకి వైద్యం చేయదు. అలాగే ప్రపంచం కూడా స్కేనింగు మిషనులాంటిది. మీలో ఉన్న బలహీనతలు ఏమిటో ప్రపంచాన్నిబట్టి మీకు తెలుస్తూ ఉంటుంది కాని ఆ లోపాలు ప్రపంచం తీయదు. నువ్వు ప్రయత్నంచేసి, సజ్జన సాంగత్యం చేసి, శాస్త్రం ఆధారంగా తీసుకొని జీవిస్తూ నీకున్న బలహీనతలను నువ్వే తొలగించుకోవాలి. ప్రపంచంలో మనం బాగుపడటానికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకుంటే మనకి ఈ జన్మలో మోక్షం రాకపోయినా, మళ్ళీ జన్మ మనకి సాధన బాగా జరిగే జన్మని పరమాత్మ ఇస్తాడు. అంతఃకరణము అంటే లోపల పనిముట్టు. నీ శరీరాన్ని ఎంత శుచిగా ఉంచుకుంటున్నావో అలాగే నీలోపల ఉన్న పనిముట్టుని (మనస్సు) కూడా అంతశుచిగా ఉంచుకో. నీ అంతఃకరణం

శుద్ధిగా ఉంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడు నీకు అనుభవంలోనికి వస్తాడు.

**కామక్రోధవియుక్తాం యతీనాం యతచేతసామ్,**

**అభిలో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ (5-26)**

కామక్రోధములు లేనివారు, మనోనిగ్రహము కలవారును, ఆత్మతత్వము తెలిసినవారు నగు ప్రయత్నశీలురకు మోక్షము ఎల్లపుడు భాసిల్లుచుండును. మానవుడికి పొరపాట్లు చేయటం ఇష్టంలేకపోయినా పొరపాటు చేయటానికి కారణం కామక్రోధాలు అని భగవంతుడు చెప్పాడు. కామక్రోధాలు ఉన్నంతసేపు నువ్వు మంచిగా ఉండాలన్నా ఉండలేవు, జ్ఞానాన్ని నిరోధించే పనులు కూడా నువ్వు చేస్తూ ఉంటావు. ఒకసారి పరమాచార్యులవారిని దుర్వాసమహర్షికి కోపం ఎక్కువకదా అని ఒకరు అడిగారు. ఆయనకి కోపం ఎక్కువ అని నువ్వు అంటున్నావు. ఆయనకి ఎక్కడా కోరికలేదు అది చెప్పటం మానేసి ఇది చెబుతున్నావేమిటి అన్నారు. అంటే మన బుద్ధి శుభ్రంగా పాడైపోయివుంది. మనం ఎదుటివాళ్ళలో చెడ్డ తీసుకుంటాం, వాళ్ళలో మంచిని వదిలేస్తాము. అలాకాదు మనం ఎదుటివారిలో మంచిని స్వీకరించి, చెడ్డని వదిలివేస్తూ ఉండాలి ఇది మన జీవితంలో ముఖ్యంగా నేర్చుకోవాలి. మన శరీరం మరణించేలోపు కామక్రోధాల్లోంచి విడుదల పొందాలి. మీకు కోరిక వచ్చిందనుకోండి అది ఒక ఉద్రేకం. మీకు కోపం వచ్చిందనుకోండి అదొక ఉద్రేకం. నీకు కోరిక, కోపము వచ్చినప్పడు నీ శరీరము, మనస్సు కూడా ఉద్రేకపడతాయి. ఏ సాధకుడు అయితే కామక్రోధాల్లోంచి విడుదలపొంది ఆత్మయొక్క వైభవాన్ని అనుభవం లోనికి తెచ్చుకుంటున్నాడో వాడికి శరీరం ఉంటే ఆనందం, శరీరం పోతే ఆనందం, లోకం కనిపిస్తే ఆనందం, లోకం కనపడకపోతే ఆనందం. వాడికి అదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం, దురదృష్టం వెంటాడుతూ ఉంటే ఆనందం. ఎటుచూచినా ఆనందమే. ఎటు చూచినా సుఖమే, ఎటుచూచినా శాంతే. అది ఆత్మ యొక్క వైభవం. మీ శరీరం పోతూ ఉంటే ఏదో పోతోంది అని మనకి అనిపించదు. ఎందుచేతనంటే ఆ శరీరం నాదికాదు అని వాడికి తెలుస్తుంది. ఇది నాది అన్నచోట మీకు ప్రీతి వస్తుంది. ఇది నాది కాదు అని తెలిసినప్పడు మీకు ప్రీతిరాదు. మీ శరీరం ఉండగానే, బ్రాహ్మీస్థితి పొందితే మంచిదే కాని ఇప్పడు ఆ స్థితి లేకపోతే మీ శరీరం చనిపోయే రోజుకైనా ఆ స్థితిని పొందాలి. అంటే నూటికి నూరుపాళ్ళు దేహంతోటి సంబంధం లేకుండా, లోకంతోటి సంబంధం లేకుండా,

నామరూపాలతోటి సంబంధంలేకుండా అదృష్టాలు, దురదృష్టాలతోటి సంబంధం లేకుండా, కర్మఫలితాలతోటి సంబంధం లేకుండా ఎవడైతే శాంతిలో కూరుకుపోయాడో వాడు ఆ లోకానికి, ఈ లోకానికి ప్రయాణం చేయవలసిన అవసరంలేదు. వాళ్ళకి గోయింగ్ ఆగిపోతుంది, కమింగ్ ఆగిపోతుంది.

మరణానంతరం ఇతరలోకాలు ఉన్నాయా అని ఒకరు గౌతమబుద్ధుడిని అడిగారు. ఆ లోకాలు ఉన్నాయి అని అంగీకరించి ఊరుకోలేదు, శరీరం మరణించిన తరువాత ఏ జీవుడు అయితే ప్రయాణం చేస్తున్నాడో ఆ జీవుడు ఎంత నిజమో, ఆ లోకాలు కూడా అంతే నిజం. ఇవన్నీ వ్యవహారికసత్యాలే కాని పారమార్థికసత్యాలు కాదు. పారమార్థిక సత్యం నీ హృదయంలోనే ఉంది అన్నారు. నీ హృదయంలో ఉన్న బంగారాన్ని వదిలేసుకొని రోడ్డు మీద ఉన్న గాజుపెంకులకోసం తిరుగుతున్నావు అని రమణమహర్షిగారు అనేవారు. కొంతమంది ఇంటి దగ్గర పరిస్థితులతోటి కలవరు. అలాగని వాళ్ళతోటి విరోధం పెట్టుకోరు. వాళ్ళ ప్రారబ్ధం వాళ్ళది, మన ప్రారబ్ధం మనది అనుకుంటారు. రావణాసురుడు భార్య అలా నటించేది కాని రావణాసురుడి గుణాలు ఆమె ఎప్పుడూ తెచ్చుకోలేదు. అలాగే వాలి భార్య కూడా వాలికి మంచి చెప్పేది. వాడి ప్రారబ్ధంలో ఉన్నది తప్పదు. మనం మంచి చెప్పాలి. వాళ్ళు విన్నా వినకపోయినా మన డ్యూటీ మనం చెయ్యాలి. వాళ్ళ ప్రారబ్ధం బలీయంగా ఉన్నప్పుడు మనం చేసేది ఏమీ లేదు. మన ప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు ఈ దేహాన్ని ఎప్పుడు ఎక్కడ వుంచాలో అక్కడ వుంచుతాడు. మనం తల్లిగర్భంలో వుండగానే మన సినిమాలు తీసేసారు. మన జీవితాలు అన్నీ తీయబడ్డ సినిమాలే. ప్రారబ్ధాన్ని బట్టి శరీరం ఆడుతూ ఉంటుంది. ప్రారబ్ధాన్ని బట్టి శరీరం ఆడేటప్పుడు సాధన ఎందుకు? అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నీకు సాధన ఎందుకు అంటే ఏదైతే ప్రారబ్ధం అనుభవిస్తోందో అది నువ్వు కాదన్న సంగతి నీకు అనుభవంలోకి రావాలి, దానికే సాధన. అప్పుడు ప్రారబ్ధం ఎటువంటిదైనా నీకు బాధరాదు. ప్రారబ్ధాన్ని బట్టి దేహం పని చేసి ప్రారబ్ధం పూర్తి అయిన తరువాత ఆ దేహం చనిపోతుంది. సాధన వలన ఆ దేహంతోటి తాదాత్మ్యం నీకు విడిపోతుంది. అప్పుడు నీకు సంతోషం వస్తే ఏదో వచ్చింది అని నీకు అనిపించదు. దుఃఖం వచ్చినప్పుడు ఏదో పోయింది అని నీకు అనిపించదు. ప్రారబ్ధం నేను అనుభవిస్తున్నాను అని నీకు ఏమీ ఉండదు. అది నువ్వు

సాధన చేయటం వలన వచ్చిన లాభం. కొంతమందికి ఎంతవున్నా శాంతి ఉండదు, సంతృప్తి ఉండదు. శాంతచిత్తము కలవాడు ఈ లోకంలో అదృష్టవంతుడు. శాంతచిత్తము కలవాడు దేహ ప్రారబ్ధాన్ని బట్టి కష్టాలు వచ్చినా, సుఖాలు వచ్చినా ఏమీ లోపలకు తీసుకోడు. వాడు పరమాత్మలో స్థిరంగా ఉంటాడుగాని ఏమీ లోపలకు తీసుకోడు.

తుకారామ్ ఏమన్నాడు అంటే ఓ రంగా! ఓ పాండురంగా! నీ చేతిలో నేను ఓడిపోలేదు, నా చేతిలో నువ్వే ఓడిపోయావు అన్నాడు. ప్రపంచంలో ఎన్ని కష్టాలు ఉన్నాయో, ఎన్ని దుఃఖాలు ఉన్నాయో, ఎన్ని దురదృష్టాలు ఉన్నాయో అన్నీ నాకు పంపేసావు. కానీ నువ్వు పంపే కష్టాలు, నువ్వు పంపే దురదృష్టాలు నావంటిమీద ఈగలు వాలినట్టు కూడా లేవు. అవి నా శాంతచిత్తాన్ని చెదరగొట్టలేదు. ఎందుచేతనంటే నేను పరమాత్మతో ఏకంగా ఉన్నాను అన్నాడు. తుకారామ్ వ్యాపారం చేసి, వ్యవసాయం చేసి చేతకాని పనులన్నీ చేసి అంతా తగులబెట్టాడు. అందుకు తుకారామ్ భార్య ఒకోసారి కొట్టేది. తెలియక పిల్లలు కూడా కొట్టేసేవారు. అన్ని బాధలు పెట్టినా భార్యమీద తుకారామ్‌కి కోపం లేదు. ఆవిడ మీద మనస్సులో విరోధం పెట్టుకోలేదు. తుకారామ్ ఎంత గొప్పవాడు అంటే తుకారామ్‌ని తీసుకు వెళ్ళటానికి వైకుంఠం నుంచి విమానం వచ్చింది. భార్య అంత హింసపెట్టినా తుకారామ్ మనస్సులో ఎక్కడా విరోధం లేకుండా విమానం వచ్చింది నువ్వు కూడా వచ్చేయి అన్నాడు. ఎక్కడికి అంది. వైకుంఠానికి అన్నాడు. వైకుంఠం అంటే ఏదో విశాఖపట్నం అనుకుంది. అప్పుడు ఆవిడ మజ్జిగ చేసుకుంటోంది. నా చేతిలో ఉన్న పని వదిలేసి నేను ఎందుకు వస్తాను. నేను రాను అంది. విమానం వెళ్ళిపోయింది. వైకుంఠం అంటే ఒక ఊరిపేరు అనుకుంది కాని మహావిష్ణువు ఉండే ప్లేసు అని ఆవిడకు తొయ్యలేదు. ఆవిడని తీసుకువెళ్ళటం నారాయణుడికి ఇష్టం లేదు అందుచేత భగవంతుడు తొయ్యనివ్వడు. వైకుంఠాన్నుంచి విమానం వచ్చి తుకారామ్‌ని తీసుకువెళ్ళింది. వాడు పరమపవిత్రుడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు శివరాత్రి. శివుడు లింగరూపంలో అవతరించిన రోజు. మూడు కాలాల్లో, మూడు అవస్థలలో మన ఆధ్యాత్మిక హృదయంలో ఏ వస్తువు అయితే స్వయంగా ప్రకాశిస్తుందో